క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం, కొయ్యాం సబ్ స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ కోత అమలు చేయనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.భయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యాం, కె.కె.నాయుడుపేట, అజ్జరాం, బడివానిపేట, నిమ్మవానిపేట, ధర్మవరం, పొన్నాడ, బొంతలకోడూరు, ముద్దాడ, కొంగరాం, డి.మత్స్యలేశం గ్రామాల్లో విద్యుత్ కోత అమలవుతుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న గుంట లక్ష్మీనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన అందించాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. ఎచ్చెర్ల మండల రీసోర్స్ కేంద్రంలో గురువారం హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలన్నారు. నేను బడికిపోతా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల సంఖ్య పెరగాలన్నారు. ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం అందజేస్తున్న స్టూడెంట్ కిట్లు అందజేయాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో విద్య బలోపేతం కావాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యా ప్రమాణాలు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నట్లు వివరించారు. ఎంఈఓలు కె.పున్నయ్య, రాజీకిశోర్ పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం



పాఠశాలలో ఏర్పాటు చేసిన వ్యాటర్ క్యాన్

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం హరిమహదేవ్ హెల్త్ ఫౌండేషన్ సంస్థ గురువారం శుద్ధ జలాన్ని ఏర్పాటు చేసింది. వాటర్ క్యాన్‌ను ఏర్పాటు చేశారు. నిరంతరం నీటి సరఫరా చేయనున్నట్లు సంస్థ ఫౌండర్ తంగి హరికృష్ణ తెలిపారు. తాగునీటి నీటిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని హెచ్ఎం పొన్నాడ వెంకటరమణ సూచించారు.

వ్యాధుల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న వైద్యుడు శేషగిరి

ఎచ్చెర్ల: పిల్లల్లో మరణాలు సంభవించకుండా వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నామని పొన్నాడ పీహెచ్‌సీ వైద్యులు శేషగిరి తెలిపారు. స్టాప్ డయేరియా కేంపైన్‌లో భాగంగా పొన్నాడలో 5 సంవత్సరాల లోపు పిల్లల వివరాలను గురువారం సేకరించారు. జింకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాలు పడుతుండటంతో ఇళ్ల చుట్టు పక్కల నీరు నిల్వ చేరి దోమలు గుడ్లు పెట్టి ఉత్పత్తిని పెంచుతాయన్నారు. దీని వల్ల డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. గృహ సందర్శనలు చేసి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యురాలు సౌమ్యశ్రీ, హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం సందర్శించారు. వసతులు, మెస్, క్లాస్ వర్కును పరిశీలించారు. మౌలిక వసతుల సమస్యను ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు ఎమ్మెల్యేకి వివరించారు. సమస్యలు రాతపూర్వకంగా తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి ప్రారంభ సమయం కంటే ముందే వెళ్లారు. సిబ్బంది సమయపాలన, కార్యాలయ నిర్వహణను పరిశీలించారు. టీడీపీ, బీజేపీ నాయకులు చౌదిరి నారాయణమూర్తి, గూరు జగపతిబాబు, సంపతి రావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాల‘నీళ్లు’



హడ్కోకాలనీలో నీటమునిగిన రోడ్డు

శ్రీకాకుళం నగరంలో గురువారం కురిసిన వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. పలు ప్రధాన రోడ్లు నీట మునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఇటీవల కాలువల్లో పూడికలు తీసినా రోడ్లపైనే రోజుల తరబడి ఉంచేయడంతో తాజా వర్షానికి మళ్లీ కాలువలోకే పూడికలు వెళ్లిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



సరస్వతి మహల్ కూడలి వద్ద..



నగరంలో జలమయమైన రోడ్డు



ఇలిసిపురంలో నిలిచిన వర్షం నీరు

వరి విత్తనాల పంపిణీ



ఎచ్చెర్ల క్యాంపస్: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



జి.సిగడాం: విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ల మేరకు విత్తనాలు అందజేశారు. స్థానిక నాయకుడు బెండు రామారావు పంపిణీని ప్రారంభించారు. రైతులందరికీ విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.

దాలెమ్మరాజువలసలో..

జి.సిగడాం: మండలంలోని దాలెమ్మరాజువలస గ్రామంలో సర్పంచ్ కుమరాపు శాంతమ్మ ఆధ్వర్యంలో రైతులకు గురువారం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఎరువుల కూడా రైతుకు సకాలంలో పంపిణీ చేస్తామన్నారు. నాయకులు రవి, శ్రీనివాసరావు, సన్యాసిఅప్పలనాయడు, అప్పన్న పాల్గొన్నారు.

రణస్థలం: ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజని అన్నారు. మండలంలోని బంటుపల్లి గ్రామంలో ప్రభుత్వం అందించిన ఎంటీయూ 1121(శ్రీధృతి), సాంబా వరి విత్తనాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. రణస్థలం సీహెచ్‌సీ మాజీ చైర్మన్ వేలిచేటి సురేష్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.



రణస్థలం: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రజని

కార్మికులకు మెరుగైన వేతనాలు ఇస్తున్నాం

- ఏపీటోరియా యాజమాన్య ప్రతినిధులు

రణస్థలం: కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాలు అందిస్తున్నామని అరబిందో (ఏపీటోరియా) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎన్.బి.రాజు అన్నారు. మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో కార్మికుల వేతనాల పెంపు, ఇతర అలవెన్స్‌లపై కాంట్రాక్టు అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్మికుల స్థితిగతులు, ఇతర విషయాలను పరిగణలోకి తీసుకుని జీతభత్యాల పెంపు, ఇతర సౌకర్యాల కల్పనపై కాంట్రాక్ట్ అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేశారని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, కరువు భత్యమే కాకుండా స్పెషల్ అలివెన్స్, ఓవర్ టైమ్, పండగ సెలవులు, బోనస్, క్యాంటీన్ రాయితీ, ఫ్యామిలీ అసిస్టెన్స్ స్కీమ్‌తోపాటుగా స్థానికులకు ఉద్యోగ అవకాలు కల్పిస్తున్నామన్నారు. సామాజిక కార్పొరేట్ తరఫున చుట్టు పక్కల గ్రామాల్లో వైద్యం, విద్య ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్మికులు, టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు జీతభత్యాలు, ఇతర వసతుల పెంపుదల చేసేందుకు అంగీకరించామని తెలియజేశారు. కార్పొరేట్ హెచ్ఆర్ కె.కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటోరియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎన్.బి.రాజు

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలువురు సిబ్బంది గురువారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ బస్టాండ్ పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యేను శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరావు, కేఆర్ఎస్ శర్మలు స్వాగతం పలికారు. ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలనుఅధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులు కలిసి సమస్యలు వివరించగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ అధ్యక్షుడు టి.ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్, జిల్లా ట్రెజరర్ ఆర్.నవీనకుమార్, చరణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు సమస్యలు వివరిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



సారవకోట: స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక పెద్దపేట రోడ్డులో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్త శిమ్మ కృష్ణమూర్తి నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కృష్ణబాబు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం..

సారవకోట: మండలంలోని చీడిపూడి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని కల్యాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని, ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యతోనే సమగ్ర అభివృద్ధి



కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

జి.సిగడాం: విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌వలస సర్పంచ్ కుమరాపు శాంతమ్మ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన స్టూడెంట్ కిట్లను గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం కూర్మినాయుడు, నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థుల్లో చురుకుదనానికి, మానసిక ప్రశాంతతకు యోగా చాలా అవసరమని, యోగా గురువు రమ్య తెలిపారు. స్థానిక భాష్యం స్కూల్‌లో గురువారం యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు ఉర్లాం శివతేజ, బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

జి.సిగడాం: యువత చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ మధుసూదనరావు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి గ్రామంలోనూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. యువత డ్రగ్స్ జోలికి వెళ్లొద్దన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న అధికారులు

జి.సిగడాం: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులకు యువత, ప్రజలు సహకరించాలన్నారు. ఏపీఓ బోళ్ల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

హిరమండలం: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆయా తరగతుల ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలన్నారు. ప్రభుత్వం అందించే పుస్తకాలతోనే విద్యాబోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థుల రవాణా, మంచినీటి సదుపాం, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతుల కల్పనలో జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థుల హాజరు ఉదయం 10 గంటల లోపే పూర్తిచేయాలన్నారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు



సాయిదర్బార్‌లో ప్రత్యేక అలంకరణ



రెల్లవీధిలో సాయినాథునికి హారతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయి దర్బార్‌లో గురువారం షిర్డీసాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాకడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అనంతరం నిత్యాన్నదానం నిర్వహించారు. రెల్లవీధిలో ఉన్న షిర్డీసాయిబాబా మహాసమాధి శతయాబ్ది మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మావుడూరి రాఘవశర్మ ఆధ్వర్యంలో స్వామికి మూడురకాల హారతులు, సత్సంగం నిర్వహించారు.

ఘనంగా విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ నీళ్లతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు, పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన 11 మంది అరెస్ట్

- నిందితులకు 14 రోజుల రిమాండ్
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ శంకర్ (వెనుక ముసుగులో నిందితులు)



దాడికి ఉపయోగించిన రాడ్డులు, కత్తి, బెల్టు

రాజాం సిటీ: పాతకక్షల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ రాత్రి ఓ యువకుడుపై హత్యాయత్నానికి పాల్పడిన 11 మందిని 24 గంటల వ్యవధిలో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. రాజాం పట్టణ పరిధి గొల్లవీధిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు స్నేహితులతో కలసి శ్రీకాకుళానికి చెందిన టి.గౌతమ్ హాజరయ్యాడు. ఫంక్షన్ అనంతరం జీఎంఆర్ కేర్ జంక్షన్‌కు వెళ్లి తన స్నేహితుడైన గొల్లవీధికి చెందిన కోడిబోయిన కార్తీక్, మరి కొంతమంది స్నేహితులను కలిసి తిరిగి మోటార్ సైకిళ్లపై వస్తున్నారు. అప్పటికే కార్తీక్‌తో గొడవలు ఉన్న గురవాంనకు చెందిన కుప్పిలి నవీన్ వీరు రావడాన్ని గమనించి కార్తీక్‌పై ఉమ్మివేశాడు. దీంతో కార్తీక్ ఎందుకు ఉమ్మివేశావని ప్రశ్నించగా.. నవీన్‌తో పాటు అతని 14 మంది స్నేహితులు కర్రలు, కత్తులతో దాడికి యత్నించారు. ఈ దాడి నుంచి కార్తీక్‌తో పాటు ఇతర స్నేహితులు తప్పించుకోగా.. శ్రీకాకుళానికి చెందిన గౌతమ్ వారికి దొరికిపోయాడు. దీంతో అతడ్ని మోటార్ సైకిల్‌పై గురవాం సమీపంలోని తోటలోకి తీసుకువెళ్లి కర్రలు, రాడ్డులు, బెల్టులతో మూకుమ్మడిగా దాడి చేశారు. గాయాలపాలైన గౌతమ్‌కు ఫొటోలు తీసి వాట్సాప్‌లో కార్తీక్‌కు పంపారు. దీంతో అప్రమత్తమైన కార్తీక్ పోలీసులకు సమాచారం అందించి గాయపడిన గౌతమ్‌ను ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నానికి పాల్పడిన 11 మంది నిందితులను గురవాం తోటల సమీపంలోను, పొనుగుటివలస జంక్షన్ వద్ద గురువారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయినవారిలో కుప్పిలి నవీన్, దుంగ సాయి, గుంట ప్రదీప్, కుప్పిలి ధనుంజయ, టొంపల అనిల్‌కుమార్, తోలేటి ఉదయ్‌కుమార్, సూరపాటి సాయికుమార్, టొంపల రవిచైతన్య, తిర్లంగి అక్షయ్‌కుమార్, కొర్ల ఫణీంద్ర, చింతాడ విద్యాసాగర్ ఉన్నారు. కుప్పిలి నవీన్‌పై కొట్లాట, గంజాయి కేసులు సంతకవిటి, రాజాం స్టేషన్‌లలో ఇప్పటికే నమోదయ్యాయి. నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేసి రాజాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్టేట్ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్సై షేక్ శంకర్ ఉన్నారు.

భూ అక్రమాలపై దర్యాప్తు చేయాలి

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ గ్రూప్‌లోని 202–5బి, 201–2 సర్వే నంబర్లలో ఉన్న దేవాదాయశాఖకు చెందిన భూముల్లో రెవెన్యూ అధికారులు పాల్పడిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.ప్రసాదరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. కొత్తూరులో గురువారం విలేకరులతో మాట్లాడారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములను రీ సర్వేలో ఓ వ్యక్తి పేరున నమోదు చేసి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు నిబంధనలు పాటించలేదన్నారు. ప్రభుత్వ భూములను జిరాయితీగా మార్చినట్లు ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బూర్జ: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బూర్జ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రాజశేఖర్, గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రోజా ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ జులై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లల పేర్లను నమోదు చేయాలన్నారు. ప్రతి పిల్లవాడికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింకు మాత్రలు అందజేసి డైయేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఎంఈఓ బి.ధనుంజయరావు, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీ-సేవ కేంద్రాల్లో సేవలు కొనసాగించాలి

ఆమదాలవలస: మీ–సేవ కేంద్రాల్లో సేవలు కొనసాగేలా ప్రభుత్వం యత్నిస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమదాలవలస నియోజకవర్గ మీ–సేవ కేంద్ర నిర్వాహకులు ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేసే మీ–సేవ కేంద్రాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకుని పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. మీ–సేవ కేంద్రాలు యథాతథంగా కొనసాగిస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మీ–సేవ కేంద్రాల నిర్వాహకులు అన్నెపు రమణమూర్తి, మొదలవలస సురేష్, బూర్జ మండల మీ–సేవ కేంద్రం ఆపరేటర్ పప్పల హరినాథరావు, సనపల హరి ప్రతాప్, బొడ్డేపల్లి అప్పలనాయుడు, అన్నెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న మీ-సేవ నిర్వాహకులు